క్లుప్తంగా

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోస్టర్‌పై సంతకాల సేకరణ, అధికారులతో ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. 'ఆడపిల్లను రక్షిద్దాం–ఆడపిల్లను చదివిద్దాం' అనే నినాదంతో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణపై కలెక్టర్ సంతకం చేసి కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ నిర్మల పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతలకు అభినందనలు



క్రీడాకారులకు కప్పు అందజేస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): ఈనెల 1, 2 తేదీల్లో విశాఖ పట్టణంలోని గాజువాకలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు 18 పతకాలు సాధించారు. వీరిని సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, పవర్ లిఫ్టింగ్ చైర్మన్ రామ్‌గోపాల్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. ఇందుకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

అపరిశుభ్రతకు దుకాణదారుడే బాధ్యత వహించాలి



పాతబస్తీ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర పరిధిలో దుకాణాల వద్ద పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకుంటే సంబంధిత దుకాణదారుడే బాధ్యత వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. సోమవారం తెల్లవారుజామున పాతబస్తీ, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో కమిషనర్ పారిశుద్ధ్యంపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు శుభ్రత పాటించాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. దుకాణాల వద్ద చెత్త కుండీలు ఉండాలని, రహదారులపై చెత్తాచెదారం వేయకూడదని చెప్పారు.

చెత్త సేకరణకు మినీ వాహనాలు ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో చెత్తసేకరణ కోసం వెంటనే 100 మినీ వాహనాలు ఏర్పాటు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇ. పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పీపీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఇటీవల కాలంలో నగరంలో చెత్త సేకరణ పేరుకుపోయిదన్నారు. ఇటీవల ప్రైవేట్ కాంట్రాక్టర్ రెడ్డి ఏజెన్సీకి సంబంధించిన 90 క్లాప్ ఆటోలను ఫైనాన్స్ కంపెనీ సీజ్ చేయడం, మరో 20 ఆటోలు మరమ్మతులకు గురికావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ క్రమంలో నగరంలో ఎక్కడ చూసినా చెత పేరుకుపోయి దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.అన్వర్, మద్దిలేటి, సుమలత పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): జొహరాపురం రహదారిలోని ఎంపరర్ మాన్షన్ అపార్టుమెంట్ వద్ద ఉన్న డివైడర్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పలువురు వివిధ సమస్యలపై కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఆయన త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్‌జునీద్, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ విద్యార్థులకు స్టేట్ ర్యాంకులు

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల వెలువడిన పీజీ పరీక్ష ఫలితాల్లో స్టేట్ ర్యాంకులతో కర్నూలు మెడికల్ కాలేజి విద్యార్థులు సత్తాచాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. ఫలితాల వివరాలను సోమవారం ఆమె విలేకరులకు వివరించారు. కర్నూలు మెడికల్ కాలేజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న వైద్య విద్యార్థులు ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన పీజీ చివరి సంవత్సరం ఫలితాల్లో వివిధ విభాగాల నుంచి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో జనరల్ సర్జరీ విభాగం నుంచి డాక్టర్ విష్ణుశేఖర్‌రెడ్డి (స్టేట్ ఫస్ట్), డాక్టర్ తేజేశ్వర్‌రెడ్డి (స్టేట్ సెకండ్), డాక్టర్ శివనాగజ్యోతి (స్టేట్ థర్డ్) ర్యాంకులతో పాటు ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజి విభాగంలో డాక్టర్ అభినయ్ (స్టేట్ ఫస్ట్), మైక్రోబయాలజి విభాగంలో డాక్టర్ వైష్ణవి (స్టేట్ సెకండ్), పెథాలజి విభాగంలో డాక్టర్ హిమబిందు (స్టేట్ ఫస్ట్–థియరీ), అనాటమి విభాగంలో డాక్టర్ జోసిలిన్ పానుగూరి (స్టేట్ థర్డ్), ఫార్మకాలజి విభాగంలో డాక్టర్ శివరంజని (స్టేట్ ఫస్ట్–థియరీ), కమ్యూనిటీ మెడిసిన్‌లో డాక్టర్ ఆయేషా (స్టేట్ ఫోర్త్), డాక్టర్ హారిక (స్టేట్ ఫిఫ్త్) ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకుని యూజీ, పీజీ విద్యార్థులు రాబోయే పరీక్షల్లో ఇదే విధంగా మంచి ఫలితాలు సాధించాలని కోరారు.



డాక్టర్ అభినయ్ (ఫోరెన్సిక్ మెడిసిన్-స్టేట్ ఫస్ట్)



డాక్టర్ కె. ఆయేషా (కమ్యూనిటీ మెడిసిన్-స్టేట్ ఫోర్త్)



డాక్టర్ ఎ. హారిక (కమ్యూనిటీ మెడిసిన్ -స్టేట్ ఫిఫ్త్)



డాక్టర్ వైష్ణవి (మైక్రోబయాలజి-స్టేట్ సెకండ్)



డాక్టర్ శివరంజని (ఫార్మకాలజి స్టేట్ ఫస్ట్-థియరీ)

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట గాంధీ విగ్రహం ఎదుట మునిసిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ పరిధి నుంచి తప్పిస్తే నేరుగా మునిసిపల్ కార్పొరేషన్ లేదా మునిసిపాలిటీలే వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే కనీస వేతనం రూ.36 వేలకు పెంచి ఇవ్వాలన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే మార్చి 6వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్,ఈశ్వర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

కేవీఆర్‌లో ట్రేడ్ ఫెస్ట్-2025

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీలో సోమవారం ట్రేడ్ ఫెస్ట్–2025 కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.కె. వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు వ్యాపార మెళకువలు నేర్చుకోవాలని, ఆ దిశగా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. అనంతరం వాణిజ్య విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.దేవికారాణి, వాణిజ్య విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాశాలల నుంచి వ్యర్థాలు రాకుండా చూడాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి, అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వ్యర్థ పదార్థాలు, మురుగు నీరు హంద్రీనదిలోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, నాయకులు కృష్ణ, మధు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్తులతో కలసి సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధం చేశారు. వారు మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఆ కళాశాలల వద్ద దీక్షా శిబిరం నిర్వహించామని, అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆ కళాశాలల నుంచి వచ్చే వ్యర్థపదార్థాలు, మురుగు నీరు హంద్రీలోకి రావడంతో గ్రామానికి తాగునీరు అందించే రింగుబావి నీరు కలుషితమవుతుందన్నారు. నీరు కలుషితం కావడంతో గ్రామంలో ప్రజలు వాంతులు, విరోచనాలు, విష జ్వరాలతో అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. దూపాడు గ్రామాన్ని కర్నూలు కార్పొరేషన్‌లో విలీనం చేశారు కానీ, కనీస మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్, హరిబాబు, షేక్షావలి, ఈశ్వర్, వినోద్, గాలేన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటం

కల్లూరు : కర్నూలు నగరంలో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఎం నాయకులు 2వేల మంది పేదలతో జెండాలు పట్టుకుని కల్లూరు 70/2బీ సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో జెండాలు పాతారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నిర్మల, పీఎస్ రాధాకృష్ణ, ఎండి. ఆనంద్‌బాబు, రాముడు, నగర కార్యదర్శి రాజశేఖర్ నాయకత్వంలో ప్రజలతో కలసి కంప చెట్లు కొట్టి, చదును చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గురు శేఖర్, నగేష్, అలివేలమ్మ, అరుణమ్మ, నరసింహులు, సాయిబాబా, రామకృష్ణ, అబ్దుల్ దేశాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడతూ అర్హులైన పేదలు అర్జీలు సమర్పిస్తే పరిశీలించి, ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్ల స్థలం కేటాయిస్తామన్నారు.

సంతాన వరదుడు.. శ్రీరంగనాథుడు

- నేటి నుంచి బ్రహోత్సవాలు ప్రారంభం
- స్వామిని కొలిస్తే సంతానం కలుగుతుందని ప్రతీతి
- 6న కల్యాణోత్సవం, రథోత్సవం
- పులికొండ తరలిరానున్న భక్తజనం

పత్తికొండ రూరల్ : మండలంలోని పులికొండ గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుడు సంతాన వరుదుడిగా ప్రసిద్ధి గాంచాడు. సంతానం కలగని దంపతులు స్వామి వారిని దర్శించి తమ కోరికను విన్నవిస్తే స్వామి వారి అనుగ్రహం సిద్ధిస్తుందని ప్రతీతి. ఇలా ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ఎందరో భక్తులు స్వామి వారి కటాక్షాన్ని పొందారు. ఇలా భక్తుల సంఖ్య ఏటేటా పెరిగిపోతోంది. ప్రతి ఏడాది లాగే సోమవారం బ్రహ్మోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా రంగనాథ స్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేకంగా అలంకరించారు.



రంగనాథస్వామి మూల మూర్తి

ఉత్సవాలు ఇలా.. సోమవారం ఆలయ అర్చకులు స్వామివారి ఆలయాన్ని శుద్ధి చేసి బ్రహ్మోత్సవ పూజలు ప్రారంభించారు. మంగళవారం కలశ స్థాపన, పుణ్యాహవాచనం, సాయంత్రం అంకురార్పణ, 5న అభిషేకం, సహస్ర నామార్చన, మహానైవేద్యం, సాయంత్రం పల్లకీసేవ, ఉపన్యాసములు ఉంటాయి. 6న ఉదయం 10.30గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, రథపూజ, రథాంగ హోమం, బలిహరణ పూజలు, సాయంత్రం 4.30 గంటలకు రథోత్సవం ఉంటుంది. 7న వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయని ఆలయ ఈఓ వీరయ్య తెలిపారు.

ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులను జీఓ నంబర్27 ప్రకారం భర్తీ చేయాలని ఏపీ రజక వృత్తిదారులసంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ రజక వృత్తిదారుల సంఘం న్యాసిటీ కమిటీ ఆరో మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో రజకులకు ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించి 90 శాతం సబ్సిడీతో స్వయం ఉపాధికి రుణాలు ఇవ్వాలని కోరారు. జీఓ నంబర్ 26 ప్రకారం కలెక్టర్ చైర్మన్‌గా రజక సంక్షేమ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం 34 మందితో నూతన న్యాసిటీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.రాముడు, ప్రధాన కార్యదర్శిగా శేషాద్రిఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, చంద్రన్న, బాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా పోస్టుల భర్తీ ప్రక్రియ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో భర్తీ చేసే ఏవేని ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన భర్తీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా మెరిట్ ఆధారంగానే భర్తీ చేస్తామన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామనే దళారుల మాటలను నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు.

రైతులకు అవగాహన కల్పించండి

కర్నూలు(సెంట్రల్): పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ, నియంత్రణకు టీకాలు వేయించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి 1 నుంచి 30వ తేదీ వరకు పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని, ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 37 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షలకు 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 207 మందికి 170 మంది హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

వన్య ప్రాణులను సంరక్షించుకుందాం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు

కర్నూలు కల్చరల్: వన్య ప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారులు బి.ఓబులేసు, లక్ష్మయ్య అన్నారు. సోమవారం దిన్నెదేవరపాడులోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ శాఖ అధికారి పి.శ్యామల, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.విజయకుమార్ ఆదేశాల మేరకు వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఏపీ స్టేట్ ఆనిమల్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు, స్నేక్ కాన్‌ఫ్లిక్ట్ ఇద్రూస్ జంతువులకు మనుషులకు మధ్య సంఘర్షణ, మనుషులకు పాములకు మధ్య సంఘర్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అడవిలో అగ్గితో కలిగే నష్టాల గురించి వీడియోల ప్రదర్శనతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రేణుక, శకుంతలమ్మ, కృష్ణ, నాగేష్, రామచంద్రుడు, సంగ మిత్ర అనిమల్ ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శేషవాహనంపై గోదా రంగనాథ స్వామి

కర్నూలు కల్చరల్ : నగర శివారులోని గోదా గోకులం శ్రీగోదా రంగనాయకి సమేత శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు సోమవారం స్వామివారు శేష వాహనం, కల్పవృక్ష వాహనాలపై విహరించారు. ధ్వజ కుంభారాధన, ధ్వజారోహణం, శేష వాహనం, కల్పవృక్ష వాహన సేవలు నిర్వహించారు. మంగళవారం సూర్య ప్రభ వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయని గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజుగుప్త పేర్కొన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు నాగనారాయణ రావు, పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, ఇల్లూరు రామయ్య, చిత్రాల వీరయ్య కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



శేష వాహనంలో విహరిస్తున్న స్వామివార్లు

ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు గెలుపుపై హర్షం



సంబరాలు చేసుకుంటున్న పీఆర్‌టీయూ సంఘం , ఏపీటీఎఫ్ నాయకులు

కర్నూలు (సిటీ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు ఘన విజయం సాధించడంతో కలెక్టరేట్ ఎదుట పీఆర్‌టీయూ నాయకులు సంబరాలు చేసుకున్నారు. యూనియన్‌నాయకుడు హృదయరాజు మాట్లాడుతూ గాదె శ్రీనివాసులు విజయం కూటమి సర్కారుకు చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఫలితం ఇలాగే ఉంటుందని చెప్పారు. ఈ సంబరాల్లో ఏపీటీఎఫ్ 1938, ఆపస్, ఆర్‌యూపీపీ, ఆప్టర్, ఎస్టీయూ, బీటీఏ, పీఈటీఏపీడీ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కర్నూలు (టౌన్): బాల్య వివాహాలను నిర్మూలిద్దామని, ఈ దిశగా ప్రజలను చైతన్యపరుచుదామని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి నిర్మల అన్నారు. సోమవారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మహిళల హక్కులు తెలుసుకోవాలన్నారు. సమాన వేతనం, వృత్తిలో మహిళలకు సమాన గౌరవం ఉండాలన్నారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ మేరీ స్వర్ణలత, లలితమ్మ, ఆంగన్ వాడీ కార్యకర్తలు, మత పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

8న మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మహిళా దినోత్సవం నిర్వహణపై డీఆర్‌డీఏ, మెప్మా, వైద్య, పోలీసు, పరిశ్రమల శాఖల అధికారులతో మాట్లాడారు. సునయన ఆడిటోరియంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ నాగ శివలీల, పరిశ్రమల శాఖ జీఎం అరుణ పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: క్లస్టర్ వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల్య వివాహాల నిర్మూలనకై సంతకాల సేకరణ, ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. ఇందులో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ఇందిరాశాంతి మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లి చేస్తే తర్వాత శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాళ్లు జె.హేమంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేసిన బాబు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా చంద్రబాబునాయుడు మోసం చేశారని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ సి.అనిల్ కుమార్ విమర్శించారు. సోమవారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నూలు వచ్చిన ఆయనకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ బజారన్న కలిసి సాదర స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. ఫీజురీయంబర్స్‌మెంట్ పథకానికి కూడా నిధులు విడుదల చేయకపోతే పిల్లల చదువులు ఎలా ముందుకు సాగుతాయని ప్రశ్నించారు.కార్యక్రమంలో సాంబశివుడు, షేక్ ఖాజా హుస్సేన్, సుంకన్న, సయ్యద్ నవీద్ పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



సింగం వినయ్, సింగం శిరీష (ఫైల్)

చాదర్‌ఘాట్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ రవిరాజ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అక్బర్‌బాగ్ డివిజన్ జమున టవర్స్‌లో 106 సింగం వినయ్, శిరీష(32) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె. శిరీష ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా పని చేస్తుండగా, ఆమె భర్త వినయ్ ప్రైవేట్ ఉద్యోగి. ఆదివారం శిరీషకు గుండెపోటు వచ్చిందని ఆమె మేనమామ మధుకర్‌కు శిరీష స్నేహితురాలు సమాచారం అందించింది. దీంతో మధుకర్ ఆమె ఇంటికి వెళ్లేలోగా వినయ్ ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. శిరీషను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించాడు. దీంతో వినయ్ శిరీష మృతదేహాన్ని తీసుకుని అంబులెన్స్‌లో తన స్వగ్రామమైన దోమలపెంటకు బయలుదేరి వెళ్లాడు. దీనిపై అనుమానం వచ్చిన మధుకర్ చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన పోలీసులు అంబులెన్స్ డ్రైవర్‌కు ఫోన్ చేసి మృతదేహాన్ని వెనక్కి రప్పించారు. కాగా శిరీష శరీరంపై గాయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శిరీషను ఆమె భర్త వినయ్ కొట్టి చంపాడని మేనమామ మధుకర్ ఆరోపిస్తున్నారు. శిరీషపై అనుమానం పెంచుకున్న వినయ్ తరచూ ఆమెను వేధించేవాడని తెలిపాడు. 2017లో వారు ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు తెలిపాడు. చాదర్‌ఘాట్ పోలీసులు ఆమె భర్త వినయ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

కలెక్టరేట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు(సెంట్రల్) : కలెక్టరేట్‌లోని కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె తన చాంబరులో కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాల అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ..అన్ని కార్యాలయాల్లో ఫైళ్లపై దుమ్ము ధూళి, బూజు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తు, రెండో అంతస్తులో ఉన్న కార్యాలయాల కిటికీల నుంచి చెత్త బయటకు వేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. కాబట్టి ఆయాకార్యాలయల అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. డస్టు బిన్‌లను ఏర్పాటు చేసుకొని అందులో వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కలెక్టరేట్‌లోని క్యాంటీన్ నిర్వాహకులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విస్మరిస్తే ఖాళీ చేయిస్తామ ని హెచ్చరించారు. ఆదేశించింది. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీపీఓ భాస్కర్, డీసీఓ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ వెంకటరమణయ్య, కలెక్టరేట్ ఏఓ విజయశ్రీ పాల్గొన్నారు.

నగరంలో ఫెర్టిలిటీ కేంద్రాల తనిఖీ



ఫెర్టిలిటీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళ, వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని పలు ఫెర్టిలిటీ కేంద్రాల (సంతాన సాఫల్య కేంద్రాలు)ను సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళ తనిఖీ చేశారు. ఇందులో ఫెర్టి9 ఫెర్టిలిటి సెంటర్, సుశ్రుత టెస్ట్ ట్యూబ్ బేబి సెంటర్ ఉన్నాయి. వీరు ఏఆర్‌టీ నేషనల్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఈ మేరకు తనిఖీ చేశామని ఆమె తెలిపారు. ఏఆర్‌టీ క్లినిక్‌లు, ఫెర్టిలిటి కేంద్రాలు ఇకపై తప్పక రిజిస్టర్ చేసుకోవాలని, ఇందుకోసం ఏఆర్‌టీ నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు పూర్తి చేసి సబ్మిట్ చేయాలన్నారు. దీంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రతులను అందజేయాలన్నారు. జిల్లా స్థాయి ఇన్స్పెక్షన్ టీమ్ పరిశీలించిన అనంతరం జిల్లా స్థాయి కమిటీలో ఆమోదించి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు. ఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. తనిఖీల్లో గైనకాలజి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలక్ష్మి, రేడియాలజి ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి, డాక్టర్ బాలమద్దయ్య, సోషియాలజిస్టు భారతి, డెమో శ్రీనివాసులు శెట్టి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత ఉన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనమివ్వాలి



నూతనంగా ఎన్నికైన పాస్టర్ అసోసియేషన్ సభ్యులు

కర్నూలు (టౌన్): కొత్తగా పేరు నమోదు చేసుకున్న పాస్టర్లకు గౌరవ వేతనం అమలు చేయాలని పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక మిలియన్ బాప్టిస్టు చర్చిలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా సంఘ కాపరుల ప్రార్థన సదస్సు, నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలన్నారు. ప్రార్థన మందిరాల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా హాజరయ్య, ఉపాధ్యక్షుడిగా సదానందం, కార్యదర్శిగా జాన్ సామేల్, పబ్లిసిటీ కన్వీనర్‌గా రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.